క్లుప్తంగా

పండగ తర్వాత 30 టౌన్ బస్సులు

నెల్లూరు (టౌన్) : సంక్రాంతి తరువాత నెల్లూరు నగరానికి 30 కొత్త టౌన్ బస్సులు రానున్నట్లు డీటీసీ చందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్టీఏ సమావేశంలో కొత్త బస్సులకు ఆమోదం తెలిపారన్నారు. ఆటోలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సులకు ఆమోదం చెప్పారన్నారు.

డీకేడబ్ల్యూలో ప్రేరణ తరగతులు



మాట్లాడుతున్న డీడీ శోభారాణి

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో వసతి గ్రహ విద్యార్థినులకు శుక్రవారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి హాజరై, మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంగా చదవాలని సూచించారు. అందరూ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ హజరత్తయ్య, ఆర్‌ఐఓ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రమణారావు, సైకాలజిస్టు రమేష్‌బాబు పాల్గొన్నారు.

భక్తబృందం సేవలు అభినందనీయం



నెల్లూరు(బృందావనం) : ముక్కోటి ఏకాదశి సందర్భంగా రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు లడ్డూ ప్రసాదం, పులిహోర వితరణ చేస్తున్న జైశ్రీరామ హనుమాన్ భక్తబృందం సేవలు అభినందనీయమని దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు అన్నారు. రంగనాథస్వామి సన్నిధిలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం వేకువజామున వైకుంఠ ద్వార దర్శనం అనంతరం భక్తులకు లడ్డూ ప్రసాదం వితరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు వేకువజాము నుంచి రాత్రి వరకు 55 వేలకుపైగా డ్రై ఫ్రూట్ లడ్డూ ప్రసాదం వితరణ హర్షణీయమన్నారు. భక్తబృందం సభ్యులు పాదర్తి బాలాజీ, సాయిబాబా, బెల్లంకొండ శ్రీనివాసులు, ఉద్దండి కోటేష్, చిమట కృష్ణయ్య, పాదర్తి శ్యామ్, కాకర్ల సోము, సాల్లేటి చిరంజీవి, దేవతి సాయిరాం పర్యవేక్షించారు.

ఓబన్న జయంతిని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న గుంజి దయాకర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలో శనివారం జరుగనున్న వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశంలో చంద్రగిరి రమణయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సింహగిరి, తిరుపాలు, సుబ్రహ్మణ్యం, సురేంద్ర పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ముస్లిం మైనారిటీ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ల ఆవిష్కరణ శనివారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అల్తాఫ్ శుక్రవారం తెలిపారు. నగరంలోని హెచ్ఎన్నార్ రెసిడెన్సీలో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు, ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు హాజరు కానున్నారని వివరించారు.

కార్పొరేట్ సేవలో ప్రభుత్వాలు



మాట్లాడుతున్న నరేంద్రరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు కార్పొరేట్ సేవలో తరిస్తున్నాయని సీఐటీయూ నేత నరేంద్రరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు అన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి ట్రస్ట్ భవనంలో 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు– కార్మికవర్గ కర్తవ్యం' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలోని కృష్ణపట్నం పోర్టును రూ.వేల కోట్లతో అభివృద్ధి చేసి ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పే ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు, రెహానాబేగం, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, అల్లాడి గోపాల్, అన్నపూర్ణమ్మ, పెంచలనరసయ్య, బత్తల కృష్ణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మూలాపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో..




బారకాసులోని శ్రీరామ మందిరంలో..



త్యాగరాజస్వామి మందిరంలో..



రంగనాథస్వామి ఆలయంలో వేడుకగా పల్లకిసేవ



మూలస్థానేశ్వరస్వామి తెప్పోత్సవం (ఇన్‌సెట్లో) కొలువైన స్వామి, అమ్మవార్లు

నేత్రపర్వం.. ఉత్తర ద్వార దర్శనం

- ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు • విశేషంగా తరలివచ్చిన భక్తులు

నెల్లూరు(బృందావనం) : ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని నగరంలోని వివిధ ఆలయాల్లో స్వామివారు శుక్రవారం ఉత్తర ద్వార దర్శనంలో భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా జరిగిన పూజాది కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనంలో శేషవాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. అలాగే గరుడ వాహనంపై శ్రీరాముడు దర్శనమిచ్చారు. వికాస్ ప్రజాహిత సేవా సమితి, సీతారామస్వామి మందిర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ పాల్గొన్నారు.
- బారకాసులోని శ్రీరామమందిరంలో వైకుంఠ ద్వార దర్శనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. మందిరంలో కొలువైన స్వామివారు గరుడ వాహనంపై కొలువై భక్తులను కటాక్షించారు. ఉభయకర్తలుగా గ్రోసు సుబ్బారావు, సత్యలక్ష్మి, గ్రోసు మురళీకృష్ణ, సరిత, చిట్టింశెట్టి హనుమంతరావు, వీరిశెట్టి సుధాకర్, శిరిగిరి సత్యనారాయణ, చాకిరాల శేషయ్య వ్యవహరించారు.
- మూలాపేటలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- వేదాయపాళెం త్యాగరాజ నగర్‌లోని సద్గురు త్యాగరాజస్వామి మందిరంలో సీతారాముల వారు ఉత్తర ద్వార దర్శనంలో కటాక్షించారు. మందిరంలో కొలువైన శ్రీసిద్ధి విఘ్నేశ్వర, జ్ఞానసరస్వతి, కమలాంబికా సహిత త్యాగరాజేశ్వర స్వామివార్లకు పూజలు, అలంకారాలు చేశారు. ఉభయకర్తలుగా భక్తబృందం వ్యవహరించింది.
- వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానం ప్రాంగణంలో గురువాయూర్ మహావిష్ణు స్వామివారి ఆలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనంలో స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు.
- ఏసీ స్టేడియం వద్ద సుజాతమ్మ కాలనీలో ఉన్న కృష్ణయోగ మందిరం, అష్టలక్ష్మి ఆలయంతో పాటు, రామనగర్‌లోని శబరి శ్రీరామ క్షేత్రం తదితర ఆలయాల్లో స్వామివారు విశేషాలంకారాల్లో కరుణించారు.
- నెల్లూరు(వీఆర్సీసెంటర్) : వెంకటేశ్వరపురంలో కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి సుప్రభాతసేవ, తిరుప్పావై పఠనం జరిపించారు. ఉత్తర ద్వారంలో ఆశీనులైన స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధుసూదన్‌రావు– శైలజ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి, అర్చకుడు సాయిభరద్వాజ పర్యవేక్షించారు.
- నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు రాహుకాల పూజలు చేశారు. సాయంత్రం వేదపారాయణం, రాత్రి కుంభ హారతులు, పల్లకి సేవ గావించారు. దేవస్థానం ఈఓ, జిల్లా దేవదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

మూలస్థానేశ్వరునికి తెప్పోత్సవం

నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం పుష్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ప్రత్యేక పూలతో అలంకరించిన తెప్పపై గణపతి, గంగ, భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి విశేషాలంకరణలో కొలువుదీరి భక్తులను కటాక్షించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి మూలవర్లను దర్శించుకున్నారు.



బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో..



వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



రాజరాజేశ్వరి అమ్మవారి సన్నిధిలో..



స్వామివారికి హారతులు



క్యూలో భక్తులు

సంక్రాంతి కోలాహలం



ఎస్పార్కే పాఠశాలలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని విద్యుత్‌భవన్‌లో శుక్రవారం సంక్రాంతి కోలాహలం నెలకొంది. మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ పాల్గొని, ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం, విజన్–2047, విద్యుత్ చౌర్యాన్ని భోగి మంటల్లో వేయడం లాంటి ముగ్గులు ఆకట్టుకున్నాయన్నారు. 50 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్న పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అకౌంట్స్ ఆఫీసర్ విజిత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీప్రసన్న, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగమణి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బాలచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, పరంధామయ్య వ్యవహరించారు. మొదటి బహుమతి జూనియర్ అసిస్టెంట్ పి.రాజేశ్వరి, రెండో బహుమతి ఆఫీస్ సబార్డినేట్ గాయత్రి, మూడో బహుమతి స్కాడా టీమ్ సభ్యులు అనూష, యమున, షీలా, మౌనిక అందుకున్నారు. కార్యక్రమంలో కొండారెడ్డి డెంటల్ ఆస్పత్రి నిర్వాహకురాలు దివ్యరెడ్డి పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న ఉద్యోగులు



నృత్యాలు చేస్తున్న మేయర్, ఉద్యోగులు



భోగి మంటలు వేస్తున్న మేయర్, కమిషనర్

'ఎస్పార్కే'లో సంక్రాంతి సంబరాలు

నెల్లూరు (టౌన్) : స్థానిక మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి ఎస్పార్కే పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నెరసం రాష్ట్ర కార్యదర్శి అన్నపూర్ణ, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, అరుణ, నజ్మ, సుందరి, హర్షవర్థిని, ప్రసన్నలక్ష్మి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంసీలో..

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ముందస్తు సంక్రాంతి పండగ సంబరాలను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నగర మేయర్ పొట్లూరి స్రవంతి, కమిషనర్ సూర్యతేజ పాల్గొని, భోగి మంటలు వెలిగించారు. ఈ సందర్భంగా సంక్రాంతి, భోగి, కనుమ పండగల ప్రాధాన్యతను మేయర్ వివరించారు. సంబరాల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం విశేషంగా ఆకట్టుకున్నాయి. డీజే పాటలకు సిబ్బంది చేసిన నృత్యాల్లో మేయర్, కమిషనర్ ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్పొరేటర్ సత్తార్‌బాషా, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న మహిళా ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్) : ఏపీ జేఏసీకి అనుబంధంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ ఆనంద్ తమ చాంబర్‌లో విడుదల చేశారు. అనంతరం వారు కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డేనియల్ పీటర్‌రావు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రాజేష్, అధ్యక్షుడు థామస్, కోశాధికారి జనార్దన్, ఈసీ మెంబర్ సుమన్, కార్పొరేషన్ కార్యదర్శులు మొహరున్నీసా, ఖాజారసూల్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : కార్పొరేషన్ పరిధిలో ఆస్తి, తాగునీటి కుళాయి పన్నులను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్థానిక ఏడో డివిజన్‌లోని అరుణాచలంవారి వీధి, రైతుబజార్, జయప్రకాష్‌వీధి సచివాలయాల పరిధిలో కమిషనర్ శుక్రవారం పర్యటించారు. డివిజన్ పరిధిలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. డివైడర్లకు, కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఇతర నిర్మాణాలకు అవసరమైన రంగులు వేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక తడికలబజార్ కూడలిలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. రోడ్ల పక్కన శిథిల స్థితిలో ఉన్న వాహనాలను, నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సంబంధిత డిపార్ట్‌మెంట్ వారికి తెలియజేసి వెంటనే తొలగించాలన్నారు. స్థానికంగా పంట కాలువను ఆక్రమిస్తూ జరిగిన నిర్మాణాన్ని గుర్తించి వార్డు ప్లానింగ్ గత కార్యదర్శికి, అనధికార ఫ్లెక్సీల తొలగింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్ మాల్యాద్రి, ఎస్ఈ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

అక్రమాల ధార

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో నీటి దందా వ్యవహారం తారస్థాయికి చేరింది. నగరంలో హోటళ్లు, విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్, వ్యాపార సముదాయాలు 3 వేలకు పైగా ఉన్నాయి. అలాగే వెయ్యికి పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఇందులో చాలా వరకు ఇంటి అవసరాల కోసం తీసుకున్నట్లు చూపించి వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్నట్లు బయటపడుతోంది. ఇలా చేయడంలో అధికారులు కీలకంగా వ్యవహరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- కుళాయి కనెక్షన్ల మంజూరులో చేతివాటం
- దర్జాగా నీటి వాడకం
- కార్పొరేషన్‌కు ఏటా రూ.కోట్లలో నష్టం
- అధికారుల తనిఖీలు కరువు



నెల్లూరు(బారకాసు) : కార్పొరేషన్ పరిధిలో మొత్తం 54 డివిజన్లలో 1,83,643 గృహాలుండగా వీటిల్లో అధికారికంగా 45,370 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. అనధికారికంగా 10 వేలకుపైగా కుళాయి కనెక్షన్లు ఉన్నట్లు సమాచారం. ఈ అక్రమ కుళాయి కనెక్షన్ల వల్ల కార్పొరేషన్ ఆదాయానికి దాదాపు రూ.10 కోట్ల మేర నష్టం ఏర్పడింది. వీటని రెగ్యులరైజేషన్ చేస్తే ఎన్ఎంసీకి ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

ఇప్పటివరకు గుర్తించినవి 5,740

ఎన్ఎంసీ పరిధిలో ప్రత్యేకంగా సర్వే నిర్వహించి ఇప్పటివరకు 5,740 అక్రమ కుళాయి కనెక్షలున్నాయని అధికారులు గుర్తించారు. వీటిలో 368 కనెక్షన్లను రెగ్యులరైజ్ చేయించగా 2,664 అక్రమ కనెక్షన్లకు సంబంధించిన యజమానులకు నోటీసులు జారీ చేశారు.

అమెనిటీస్ ఏం చేస్తున్నారు..?

ఎన్ఎంసీ పరిధిలో మొత్తం 166 సచివాలయాలు ఉండగా అందులో 120 మంది వరకు అమెనిటీస్ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు కుళాయి కనెక్షన్ల ఇచ్చే పనులు కూడా చేపట్టాల్సి ఉంది. కుళాయి కనెక్షన్లకు సంబంధించి ట్యాప్ ఇన్‌స్పెక్టర్, ఫిట్టర్లు ముగ్గురికి ఒకరు రిటైర్డ్ కాగా మిగిలిన ఇద్దరు పని చేస్తున్నారు. వీరితో పాటు సచివాలయ అమెనిటీస్ కుళాయి కనెక్షన్ల పనులను నిర్వర్తించాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా ఆప్కాస్ ద్వారా నియమితులైన వారు, టైమ్ స్కేల్, నాలుగో తరగతి ఉద్యోగులు, అటెండర్లు దాదాపు 20 మందికిపైగా ఉన్న వారు ఫిట్టర్ ఇన్‌చార్జిలుగా ఉంటూ కూళాయి కనెక్షన్ల పనులు చేస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

జరుగుతోంది ఇలా..

కుళాయి కనెక్షన్‌కు సంబంధించి వాణిజ్య అవసరాల కోసం అయితే రూ.20 వేల నుంచి రూ.29 వేల వరకు, గృహ అవసరాలకైతే రూ.13 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. నీటి పన్ను కింద గృహ అవసరాలకు రూ.200, వాణిజ్య అవసరాలకైతే నీటి మీటరు పెట్టి వినియోగం మేరకు వసూలు చేస్తారు. వాణిజ్య అవసరాలకు ఇవన్నీ రెట్టింపు మొత్తం చెల్లించాల్సి రావడంతో వినియోగదారులు తగ్గించుకునేందుకు యత్నిస్తుండగా అదే అదనుగా భావించిన సిబ్బంది దాన్ని అక్రమాలుగా మలుచుకుంటున్నారు. కొన్నిచోట్ల వాణిజ్య భవనాలను గృహాలుగా చూపించి నీటి కుళాయి కనెక్షన్ ఇస్తున్న ఘటనలు చాలానే ఉన్నాయి. కొందరు సిబ్బంది ఓ అడుగు ముందుకేసి ప్రధాన పైపులైన్ల నుంచి, తాగు నీటి ట్యాంకుల నుంచి అపార్ట్‌మెంట్లకు అనధికార కనెక్షన్లు ఇస్తున్న ఉదంతాలున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారిస్తే మరిన్ని అక్రమాలు బయటపడుతుంది.

అక్రమ కనెక్షన్లపై సర్వే చేయిస్తున్నాం



అక్రమ కుళాయి కనెక్షన్లకు సంబంధించి సర్వే చేయిస్తున్నాం. ఇప్పటికే కొంతమేర చర్యలు తీసుకున్నాం. ఇంకా సర్వే చేయిస్తున్నాం. కుళాయి కనెక్షన్లకు సంబంధించి అమెనిటీస్ కార్యదర్శులు చూసుకోవాలి. ఈ విషయంలో ఎవరైతే పనిచేయరో వారిపై చర్యలు తీసుకుంటాం. ఎవరైనా అక్రమ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిస్తే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే అడ్డుకుని తగిన చర్యలు తీసుకుంటాం.

– రామ్మోహన్‌రావు, ఎస్ఈ, ఎన్ఎంసీ